సీఎం సహాయనిధి పత్రాల పంపిణీ


సీఎంఆర్‌ఎఫ్ ధ్రువ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన ముగ్గురు అభ్దిదారుల వైద్య ఖర్చుల కోసం రూ. 5 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే టీ. పద్మారావు గౌడ్ అందించారు. అనారోగ్యం బారిన పడి వైద్య సహాయం కోసం పుష్పలత (సీతాఫలమండీ), రాజేశ్వరి (వారాసీగుడా), మహమ్మద్ అన్సారి (బౌద్ధనగర్)లు సీతాఫలమండి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఆశ్రయించారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ చొరవ తీసుకొని వారికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 5 లక్షల మేరకు విలువజేసే ఎల్‌ఓసీ ధ్రువ పత్రాలను ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఇప్పించారు. కార్యక్రమంలో బీఆర్ ఎస్ నాయకుడు గరికపోగుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్తవేస్తే జరిమానాలు తప్పవు


పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్: రహదారులపై ఇష్టారాజ్యంగా చెత్త చెదారాలు, వ్యర్థ పదార్థాలను పారబోస్తున్న వ్యక్తులను గుర్తించి జరిమానాలు విధిస్తామని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ హెచ్చరించారు. ఇందుకోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని ఆమె చెప్పారు. బుధవారం డివిజన్ పరిధిలో చెత్త డంపింగ్ కేంద్రాలుగా మారుతున్న నాలుగు ప్రాంతాలను ఆమె సందర్శించారు. రామలింగేశ్వరాలయం సమీపంలోని డేడ్‌లాక్ బిల్డింగ్, బ్రాహ్మణ బస్తీ, సురేష్ థియేటర్, మున్మ్దగూడ ప్రాంతాలు చెత్తచెదాలకు నిలయంగా మారుతున్నట్లు స్థానికుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె, శానిటరీ విభాగం అధికారులు, పర్యవేక్షకులతో కలిసి ఆయా ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. కార్యక్రమంలో శానిటేషన్ డీఈ వెంకటేష్, రాంకీ సంస్థ డివిజన్ పారిశుద్ధ్య ఇన్చార్జి దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

5న జై భీమ్ ఆటో యూనియన్ మహాధర్నా

లాలాపేట: రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలనీ డిమాండ్ చేస్తూ జై భీమ్ ఆటో రిక్షా ఏఐటియుసి యూనియన్ ఆధ్వర్యంలో నవంబర్ 5న నిర్వహించ తలపెట్టిన చలో హైదరాబాద్, మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ జై భీమ్ ఆటో రిక్షా(ఏఐటియుసి అనుబంధ) మెడ్చల్ జిల్లా డిప్యూటీ సెక్రటరీ సీహెచ్ మల్లికార్జున్, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జాల కృష్ణమూర్తి తదితరులు పిలుపునిచ్చారు. ఈ మేరకుబుధవారం చలో హైదరాబాద్, మహాధర్నా వాల్‌పోస్టర్‌ను, జై బీం ఫ్లెక్స్ బ్యానర్‌ను ఆవిష్కరించారు.

నూతన కమిటీ ఎన్నిక



లాలాపేట: మాణికేశ్వర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఇటీవలే ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షులుగా జి.కుమార్, ఉపాధ్యక్షులుగా ఏ. మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శిగా బి. ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శిగా జి. హరి, కోశాధికారిగా పి. శ్రీనివాస్, ఆర్గనైజర్‌గా ఎస్. వెంకటేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి.అరుణ్ కుమార్ తదితరులు ఎన్నికైనారు. ఈ అసోసియేషన్‌కు సలహాదారులుగా బి. చంద్రశేఖర్, జి. నర్సింహ్మా, ఏ.ముత్యాలు, భార్గవిరాజ్, పి. రాజు, ఏ. విజయ్‌కుమార్ తదితరులు వ్యవహరిస్తున్నారు. ఈ మేరకు అసోసియేషన్ నూతన కమిటీ బుధవారం బస్తీలోని సెవెన్ టెంపుల్స్‌లో ప్రత్యేక పూజలు చేశారు.

విధినిర్వహణలో జాగ్రత్తలు అవసరం



బన్సీలాల్‌పేట్: ఆర్టీసీ డ్రైవర్లు ప్రమాదరహితంగా బస్సులు నడుపుతూ ...ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉపశంకర్ డ్రైవర్లకు పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ రాణిగంజ్ ఆర్టీసీ డిపోలో బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బస్‌లోనే బస్సులను ఆపాలన్నారు. ప్రయాణికులు బస్సు ఎక్కేటప్పుడు, దిగే విషయాన్ని డ్రైవర్లు గమనించాలని కోరారు. ఓవర్ స్పీడ్‌తో బస్సులను నడిపి ప్రమాదాలకు కారణం కాకూడదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున డ్రైవర్లు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

ఓయూలో ముగిసిన సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ విద్య కళాశాల (బీఈడీ కాలేజీ) ఆధ్వర్యంలో మూడు రోజులు దూరవిద్య కేంద్రంలో జరిగిన జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. ప్రొ.మృణాళిని ఉద్యోగ విరమణ సందర్భంగా భారతీయ విజ్ఞాన వ్యవస్థ మూలాలు వాటి పునరుద్ధరణ అనే అంశం పై జాతీయ సదస్సు జరిగింది. అనంతరం బీఈడీ కాలేజీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రొ.మృణాళిని ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఉర్దు వర్సిటీ వీసీ ప్రొ.సయ్యద్ అయినుల్ హసన్, ఉన్నత విద్య మండలి కార్యదర్శి ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ పాల్గొన్నారు.

నూతన రిజిస్ట్రార్‌గా ప్రొ.నరేష్ రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ నూతన రిజిస్ట్రార్‌గా కామర్స్ విభాగం ప్రొ.నరేష్ రెడ్డి, వీసీకి ఓఎస్‌డీగా జంతుశాస్త్రం విభాగం ప్రొ.జితేంద్రనాయక్‌లను వీసీ ప్రొ.కుమార్ నియమించారు. బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించిన వారు గతంలో వివిధ పదవులను నిర్వహించారు.

ఓయూ సమస్యలను పరిష్కరించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు బుధవారం వీసీ ప్రొ.కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. రెగ్యులర్‌గా తరగతులు జరిగేలా చర్యలు తీసుకోవాలని, పీజీ విద్యార్థులకు పూర్తిగా ఇంగ్లిష్‌లో మాట్లాడటం, రాయడంలో ప్రత్యేక శిక్షణ ఉచితంగా ఇవ్వాలని, నాన్‌నెట్ ఫెలోషిప్‌ల పునరుద్ధరణ, మెస్ బకాయిల రద్దు, విద్యార్థుల బీమాను తిరిగి ప్రారంభించాలని, 24 గంటలు లైబ్రరీని తెరిచి ఉంచి సౌకర్యాలు కల్పించాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో పరిశోధన విద్యార్థి వలిగొండ నరసింహతో పాటు శివశంకర్‌గౌడ్, వేదాంత మౌర్య, రవితేజ, అర్జున్, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెలుగుల పండగకు అంతా సిద్ధం..


అమీర్‌పేట్‌లో దీపావళి టపాసుల షాపింగ్

సనత్‌నగర్: వెలుగుల పండుగ దీపావళి జోష్ మొదలైంది. సనత్‌నగర్ నియోజకవర్గంలోని వీధులన్నీ పండుగ సందడిని సంతరించుకున్నాయి. కొనుగోలుదారులతో రోడ్లన్నీ కిటకిటలాడాయి. ఇంటింటా వెలుగులను ప్రసరింపజేసేందుకు కనువిందు చేసే ప్రమిదలు మార్కెట్‌ను ముంచెత్తాయి. వీటి కొనుగోలు కోసం మహిళలు పోటీపడ్డారు. విపరీతమైన డిమాండ్ ఉన్న నేపథ్యంలో వ్యాపారులు వాటి ధరలకు రెక్కలు తొడిగారు. సాధారణంగా సైజును బట్టి జత ప్రమిదలు రూ.5ల నుంచి రూ.10 ఉండగా వ్యాపారులు రూ.20ల నుంచి రూ.30కు పెంచి అమ్మకాలు జరిపారు. అలాగే స్టెప్స్ ప్రమిదలు అయితే ఏకంగా రూ.50లకు విక్రయాలు జరిపారు. ఇక మైనంతో నింపిన ప్రమిదలు అమ్మకాలూ జోరందుకున్నాయి. వీటికి భిన్నంగా మార్కెట్లోకి వచ్చిన ఎలక్ట్రానిక్ ప్రమిదలు సైతం హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. సనత్‌నగర్, అమీర్‌పేట్, బేగంపేట్, రాంగోపాల్‌పేట్, బన్సీలాల్‌పేట్ డివిజన్ల పరిధిల్లో ఏ రహదారి చూసినా ప్రమిదలు, లక్ష్మీపూజకు అవసరమైన పూలు, ఇతర సామాగ్రి అమ్మకందారులు, కొనుగోలుదారులతో కిక్కిరిసాయి. అలాగే స్వీట్స్‌తోనే దీపావళి మజా అన్నట్లుగా స్వీట్స్‌షాపుల వద్ద కొనుగోలుదారులు బారులుదీరారు. తమ ఆత్మీయులకు, కుటుంబసభ్యులకు స్వీట్స్‌బాక్స్‌లను అందజేసి శుభాకాంక్షలు తెలిపేందుకు రెడీ అయ్యారు. వ్యాపారులు దీపావళి స్వీట్స్‌ను కళ్లు జిగేల్‌మనేలా ప్యాకింగ్ చేసి మైమరిపిస్తున్నారు. అలాగే పలు సంస్థల యాజమాన్యాలు తమ సిబ్బందికి బోనస్‌లు ఇవ్వడంతో పండుగ ఖుషీ రెట్టింపయ్యింది. దీపావళి అనగానే గుర్తుకొచ్చేది బొమ్మల కొలువు. విభిన్న ఆకృతుల్లో ఆకట్టుకునే స్టైల్‌లో బొమ్మలు కొనుగోలుదారులను కనువిందు చేశాయి. వీటి కొనుగోలుకు మహిళలు ఆసక్తికనబరిచారు. అలాగే పండుగ సందర్భంగా వస్త్ర, బంగారు దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

నింగికెగిసేలా టపాసుల వెలుగులు

బాణాసంచా దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. మినీకాశీగా పేరొందిన సనత్‌నగర్‌లో ఈ సారి దాదాపు 125 వరకు దుకాణాల వరకు వెలిశాయి. ఇవి కాకుండా బల్కంపేట్, ఎస్‌ఆర్‌నగర్, అమీర్‌పేట్, బేగంపేట్ తదితర ప్రాంతాల్లో లెక్కకు మిక్కిలిగా దుకాణాలు ఏర్పాటుచేసి అమ్మకాలు జరుపుతున్నారు. అన్ని షాపుల్లోనూ ఫ్యాన్సీ టపాసులే. చిన్నా, పెద్దా తారతమ్యం లేకుండా బాణాసంచా కొనుగోళ్లు జోరుగా సాగిస్తున్నారు. కొత్తగా వచ్చిన టపాసుల గురించి ఎక్కువగా ఆరా తీయడం కనిపించింది.

గుమ్మెత్తిన పూల ధరలు

దీపావళి సందర్భంగా పూల అమ్మకాలు జోరందుకున్నాయి. సనత్‌నగర్ నియోజకవర్గంలోనే టన్నుల కొద్ది పూల అమ్మకాలు సాగాయి. ఎర్రగడ్డ, అమీర్‌పేట, సనత్‌నగర్, మోండా మార్కెట్ తదితర ప్రాంతాల్లో పూల విక్రయాలు విరివిగా జరిగాయి. వినియోగదారుల అవసరాన్ని బట్టి వ్యాపారులను ధరలను అమాంతం పెంచేశారు. దీంతో మూములు రోజుల్లో కంటే రెట్టింపు ధరకు పూలను విక్రయించడంతో వినియోగదారులు నోరెళ్లబెట్టారు. కిలో బంతి పూల ధరలు రూ.150–200ల వరకు పలకడం గమనార్హం.





ఎమ్మెల్యేగారూ... ప్రొటోకాల్ ఇప్పుడు గుర్తుకువచ్చిందా?


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చిలకలగూడ: సికింద్రాబాద్ ఎమ్మెల్యేకు ఇప్పుడు ప్రొటోకాల్ గుర్తుకురావడం శోచనీయమని, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను కించపరుస్తు మాట్లాడిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని సికింద్రాబాద్ కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. సీతాఫల్‌మండి మైలార్‌గడ్డలో కాంగ్రెస్ నాయకుడు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి నేతృత్వంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో పలు అంశాలపై మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో ప్రొటోకాల్‌ను తుంగలోకి తొక్కి, ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలోను మీ కుమారులను స్టేజ్‌పై కూర్చుండబెట్టి, కార్పొరేటర్లు, అధికారులను ప్రక్కన పెట్టిన ఎమ్మెల్యే పద్మారావు ఇప్పుడు ప్రొటోకాల్ గుర్తించి మాట్లాడడం తగదన్నారు. ప్రజా అభివృద్ధి పనులు, ప్రారంభోత్సవాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎప్పుడు కూడా ప్రొటోకాల్ ఉల్లంఘించలేదని స్పష్టం చేశారు. అధికారులు, బీఆర్‌ఎస్ కార్యకర్తల మాదిరిగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను కించపర్చే విధంగా ఎమ్మెల్యే పద్మారావు మాట్లాడితే ఇకపై ఉపేక్షించేంది లేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాదిరెడ్డి జలంధర్ రెడ్డి, అభిషేక్, పాపాలాల్, ప్రతాప్‌కుమార్, శంకరరావు, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

తలసానిని కలిసిన లష్కర్ సాధన సమితి నేతలు


తలసానిని కలిసిన లష్కర్ సాధన సమితి ప్రతినిధులు

సికింద్రాబాద్: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని లష్కర్ జిల్లా సాధన సమితి ప్రతినిధులు బుధవారం మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిశారు. ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన అనంతరం లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ తలసానికి శుభాకాంక్షలు తెలుపడంతోపాటు జిల్లా సాధన ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లే అంశాల పట్ల చర్చించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు సాదం బాల్‌రాజ్ యాదవ్, శైలేందర్, మిట్టపల్లి బాబూరావు, కృష్ణముదిరాజ్, రవీంద్రసాగర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాలలు వేసిన బీఆర్‌ఎస్‌నేతలు


అన్నానగర్ చౌరస్తాలో సంబురాల్లో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

రసూల్‌పురా: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టే ప్రజా వ్యతిరేక చర్యలపై బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో ప్రజల తరపున పోరాటం చేస్తుందని బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టిఎన్. శ్రీనివాస్ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీవొత్తిడికి తల్గొగ్గి కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయం వెనక్కి తీసు కున్న సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కంటోన్మెంట్ నియోజకవర్గం అన్నానగర్ చౌరస్తా తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాలలు వేసి బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు, స్థానికులకు మిఠాయిలు పంచిపెట్టారు. కాంగ్రెస్ పార్టీ విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపేందుకు ప్రయత్నించడంతో ఉద్యమిస్తామని కేటీఆర్ హెచ్చరించడంతో ప్రభుత్వం దిగిరాకతప్పలేదని టిఎన్. శ్రీనివాస్, బోర్డు మాజీ సభ్యురాలు అనిత ప్రభాకర్ అన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు కుమార్ ముదిరాజ్, పనసా సంతోష్, దేవులపల్లి శ్రీనివాస్, ధన్ రాజు, నర్సింహ్మా, శ్యామ్‌రెడ్డి, అబ్దుల్ వాహబ్, అజ్జుభాయ్, శ్రీను, ధనుంజయ్ ప్రకాష్, రాకేష్, శేఖర్, అశోక్. తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



సికింద్రాబాద్: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మౌలాలి సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద మృతదేహం పడిఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులకు మృతుడి వివరాలు లభించలేదు. ఉమారు 45 సంవత్సరాల వయసున్న సదరు వ్యక్తి రైలు డోరు నుంచి జారిపడి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి ఒంటిపై ఆరెంజ్ కలర్ టీ షర్టు, బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. వివరాల కోసం 8712658581 నెంబరు ద్వారా సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ

సనత్‌నగర్: పారిశుద్ధ్య కార్మికులను గుర్తించి వారికి ప్రోత్సాహాన్ని అందించడం ప్రతిఒక్కరి బాధ్యత అని బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ అన్నారు. దీపావళి పండుగను పురస్కరించుకుని సనత్‌నగర్ డివిజన్‌లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం ఆయన చీరలు, క్రాకర్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వెల్లాల మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని కాపాడడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎనలేనిదన్నారు. వారి సేవలను గుర్తించి వారికి చేయూతను అందిస్తే మరింత ఉత్సాహభరితంగా సేవలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



భాగ్యలక్ష్మి టెంపుల్‌ను సందర్శించిన డిప్యూటీ మేయర్



లాలాపేట: దీపావళీ పర్వదినాన్ని పురస్కరించుకుని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి దంపతులు బుధవారం చార్మినార్ వద్ద ఉన్న ఉన్న భాగ్యలక్ష్మీ టెంపుల్‌ను సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు డిప్యూటీ మేయర్‌కు తీర్థప్రసాదాలను అందజేశారు.

11న ఆర్యవైశ్య మహాసభ ఎన్నికలు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్ష ఎన్నికలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టామని ప్రస్తుత అధ్యక్షులు మర్యాల జగదీష్ తెలిపారు. సికింద్రాబాద్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 11వ తేదీ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎన్నికలు జరుగుతాయని 5గంటలకు కౌంటింగ్ కౌంటింగ్, అనంతరం ఎన్నికల ఫలితాలు ప్రకటిస్తామని చెప్పారు. ఈ ప్రక్రియ మొత్తం ఆవులమందలోని కన్యకాపరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలో జరుగుతుందని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మి కుబేర వ్రతం



రాంగోపాల్‌పేట్: రాంగోపాల్‌పేట్ డివిజన్ జవహార్‌నగర్‌లోని రామ మందిరంలో బుధవారం లక్ష్మి కుబేర వ్రతం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వందలాది మంది మహిళా భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు. సికింద్రాబాద్‌లో నుంచే కాకుండా నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి ఈ పూజలు చేశారు. స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర తదితర ప్రముఖులు కూడా పాల్గొన్నారు.

పోలీసుల తీరు తప్పపట్టిన హైకోర్టు

రాంగోపాల్‌పేట్: ముత్యాలమ్మ దేవాలయంలో సాక పెట్టేందుకు వెళ్లిన కార్పొరేటర్ కొంతం దీపిక ఆమె భర్త నరేష్ కుమార్‌ను పోలీసులు అడ్డుకోవడం పట్ల హైకోర్టు పోలీసుల తీరును తప్పుపట్టింది. ఈ నెల 20న మోండా మార్కెట్ కార్పొరేటర్ కొంతం దీపిక, ఆమె భర్త నరేష్ కుమార్‌లు కుమ్మరిగూడ ముత్యాలమ్మకు మొక్కు ఉండటంతో దేవాలయంలో సాక పెట్టేందుకు వెళ్లారు. అక్కడ విధుల్లో ఉన్న మార్కెట్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్‌తో పాటు సిబ్బంది వారిని వెళ్లకుండా అడ్డుకున్నారు. తాము ఇద్దరం మాత్రమే ఉన్నామని చెప్పినా వినలేదు. అయినప్పటికీ వారు ఏమైనా చేసుకోండంటూ అమ్మవారిని దర్శించుకునేందుకు వెళ్లారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో హైకోర్టు అడ్వకేట్ కరుణ సాగర్ బుధవారం హైకోర్టులో లంచ్ మోషన్ పిటీషన్ దాఖలు చేశారు. ఈ కేసు విచారించిన న్యాయమూర్తి విజయసేన్ రెడ్డి పోలీసుల తీరును తప్పుపట్టారు. ఎవరి మతాన్ని వారు ఆచరించేందుకు రాజ్యాంగం హక్కు కల్పించిందని ఎలా అడ్డుకుంటారని, చట్ట విరుద్ధంగా వ్యవహరించవద్దని న్యాయమూర్తి పోలీసులకు చురకలు అంటించింది.

సందడిగా దీపావళి వేడుకలు



పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బోలక్‌పూర్‌లోని శ్రీ క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో బుధవారం దీపావళి వేడుకలు ఘనంగా జరిగాయి. పెద్ద ఎత్తున విద్యార్థులు బొమ్మల అలంకరణతో టపాసులు కాల్చి సందడి చేశారు. విద్యార్థుల ఆటాపాటలతో ...ఆనందోత్సాహాల మధ్య ఈ వేడుకల సంబరాలు అంబరాన్ని తాకాయి. సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఈ వేడుకలు ఘనంగా జరిగాయి.కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.







సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379